క్లుప్తంగా

అనధికార నిర్మాణాలపై కొరడా



నిర్మాణాలను తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

కర్నూలు (టౌన్): స్థానిక కొండారెడ్డి బురుజు సమీపంలోని స్వర్ణకారుల కాంప్లెక్స్ 2వ అంతస్తులో అనధికారికంగా చేపడుతున్న నిర్మాణాలను మంగళవారం నగరపాలక అధికారులు తొలగించారు. అనుమతులు లేకుండా భారీ స్థాయిలో చేపడుతున్న షాపుల నిర్మాణాలకు టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసినా స్వర్ణకారుల కాంప్లెక్స్ అసోసియేషన్ నాయకులు ఏమాత్రం స్పందించకపోవడంతో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ భవనాన్ని పరిశీలించి సిబ్బందిచేత నిర్మాణాలను తొలగించారు. కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, సహాయ సిటీ ప్లానర్ రంగస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

సాహితీ వేత్త విజయలక్ష్మి మృతి తీరని లోటు



చక్కిలం విజయలక్ష్మి (ఫైల్)

కర్నూలు కల్చరల్: సాహితీ వేత్త చక్కిలం విజయలక్ష్మి మృతి సాహితీ రంగానికి తీరని లోటని పలువురు సాహితీ వేత్తలు అన్నారు. వయోభారం, అనారోగ్య సమస్యలతో సోమవారం రాత్రి వీఆర్ కాలనీలోని స్వగృహంలో ఆమె తుది శ్వాస విడిచారు. పలువురు కవులు, రచయితలు, సాహితీ అభిమానులు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, జిల్లా గౌరవాధ్యక్షులు బసవరాజు, జిల్లా కార్యదర్శి అయ్యన్న, సాహితీ వేత్తలు జంధ్యాల రఘుబాబు, ఎస్.డి.వి. అజీజ్, గొరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, నరసం సభ్యులు ఆమె మృతికి సంతాపం ప్రకటించారు. ఆమె రచించిన కర్నూలు జిల్లా చరిత్ర అనేక పత్రికల్లో ప్రచురితమైందని, 14 నవలలతో పాటు అనేక ఆధ్యాత్మిక రచనలు చేశారని గుర్తు చేసుకున్నారు.

బీరప్ప ఆలయానికి విరాళాలు



ఆలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న దాతలు

కర్నూలు(అర్బన్): జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో పెద్దపాడు సమీపంలోని మోడల్ స్కూల్ వద్ద దాతల ఆర్థిక సహకారంతో బీరప్ప స్వామి ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి తెలిపారు. మంగళవారం మాసామసీద్ గ్రామానికి చెందిన కురువ రామకృష్ణ రూ.25 వేలు, కురువ నాగేశులు రూ.25 వేలను విరాళంగా అందజేశారన్నారు. ఆలయ నిర్మాణంతో పాటు కల్యాణ మండపం, విద్యార్థులకు హాస్టల్ వసతి కోసం గదుల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ నిర్మాణాలకు జిల్లాలోని కురువ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. నగదు రూపంలో కాని సిమెంట్, ఇసుక, స్టీల్ తదితర మెటీరియల్‌ను కూడా అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బీసీ తిరుపాల్, బాబు, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో ప్రాణనష్టాన్ని నివారించాలి



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): అత్యవసర పరిస్థితుల్లో ప్రాణనష్టాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్థోపెడిక్ వైద్యులు కిరణ్‌కుమార్, మంజునాథ్ సూచించారు. ప్రపంచ ట్రామా డే సందర్భంగా మంగళవారం మెడికవర్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మితిమీరిన వేగం, హెల్మెట్ ధరించకపోవడం లాంటి కారణాలతో రోడ్డు ప్రమాదాల్లో మరణించే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమర్జెన్సీ కేర్ డాక్టర్ సునీల్‌కుమార్ యాదవ్, జనరల్ మెడిసిన్ డాక్టర్ సరయు రెడ్డి, రుమటాలజిస్టు డాక్టర్ సృజన, వైస్ ప్రెసిడెంట్ వై.మహేశ్వరరెడ్డి, సెంటర్ హెడ్ పి.సీలారెడ్డి పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

రుద్రవరం: మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన సుబ్బమ్మ అనే వృద్ధురాలు మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు భర్త లేకపోవడం, కుటుంబ సమస్యలతో మనస్థాపానికి గురైన ఆమె పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్య శాలకు తీసుకెళ్లగా.. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకై కర్నూలుకు తరలించారు.



పెద్దమ్మ వారి శాలలో రాధేశ్యామల అలంకరణలో అమ్మవారు,



నాగలాపురంలో అన్నపూర్ణగా..,



కల్లూరులో కొలువు దీరిన దుర్గామాత,



సూర్యనారాయణ స్వామి ఆలయంలో...,



చిన్న అమ్మవారి శాలలో మంగళ గౌరీ వ్రతం చేస్తున్న మహిళలు

అమ్మవారి దర్శనం.. భక్తి పరవశం

కర్నూలు కల్చరల్: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. నగరంలోని ఆలయాల్లో అమ్మవారిని పలు రూపాల్లో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పంచామృతాభిషేకాలు, హోమాలు, రథోత్సవం, లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలకు పూజలు చేశారు. వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆధ్యాత్మిక నృత్యాలు, సంకీర్తనలు, కోలాటం, చెక్క భజన, హరికథలు, ప్రవచనాలు జరిగాయి. నాగలాపురం సుంకులా పరమేశ్వరి ఆలయం, వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయం, కల్లూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం, సప్తగిరి నగర్‌లోని చౌడేశ్వరి దేవి ఆలయంలో అన్నపూర్ణగా, చిన్న అమ్మవారి శాలలో సంతాన లక్ష్మిగా, పెద్ద అమ్మవారిశాలలో రాధేశ్యామ అలంకారం, నన్నూరు సరస్వతీ దేవి ఆలయంలో మహాలక్ష్మిగా, వన్‌టౌన్ గీతా మందిరంలో శ్రీ శృంఖలా దేవిగా, చిత్తారి వీధి నిమిషాంబ దేవి ఆలయంలో లలితా దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. బుధవారపేట, వన్‌టౌన్ కాళికాంబ దేవి ఆలయం, బండిమెట్ట అంబా భవాని ఆలయం, వన్‌టౌన్ కాళికాంబ ఆలయం, ఆరోరా నగర్ రాజరాజేశ్వరి దేవి ఆలయం, సూర్యనారాయణస్వామి ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.



అమ్మవారికి హారతి ఇస్తున్న భక్తులు,



లలితా పీఠంలో సామూహిక కుంకుమార్చనలో భక్తులు,



సూర్యనారాయణ స్వామి ఆలయంలో అమ్మవారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు



గీతా మందిరంలో శ్రీశృంఖలా దేవిగా..

ప్రజలు సమైక్యతా భావంతో మెలగాలి



అమృత కలశ యాత్రలో పాల్గొన్న ఎంపీ సంజీవ్‌కుమార్, మేయర్ బీవై రామయ్య తదితరులు

• ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్

కర్నూలు (టౌన్): ప్రజలందరూ సమైక్యతా భావంతో మెలగాలని కర్నూలు పార్లమెంటు సభ్యులు డాక్టర్ సంజీవ్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో యువజన సర్వీసులు, విద్యాశాఖ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన మేరీ మట్టి, మేర దేశ్- అమృత కలశ యాత్రలో ఆయన పాల్గొన్నారు. కలశ యాత్ర స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం నుంచి వైఎస్ఆర్ సర్కిల్ మీదుగా ఇండోర్ స్టేడియం వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 ఏళ్ల భారత స్వాతంత్య్ర సంబరాల్లో భాగంగా అన్ని రాష్ట్రాలు, అన్ని జిల్లాలు, గ్రామాల్లో అమృత కలశ యాత్ర పేరుతో ప్రజల్లో సమైక్యతా భావం పెంచేందుకు మేరీ మట్టి- మేర దేశ్ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ఆయా రాష్ట్రాలు, జిల్లాల్లో సేకరించిన మట్టి, ధాన్యాలతో యాత్ర ఈనెల 30న ఢిల్లీకి చేరుకుంటుందన్నారు. నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ మేరీ మట్టి- మేర దేశ్ అమృత కలశ యాత్ర భారతీయులలో ఐక్యతను చాటిందన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రంగారెడ్డి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ, ఎన్‌సీసీ అధికారి రఘురామ్, సాయి శిక్షణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, నెహ్రూ యువకేంద్ర జిల్లా సమన్వయకర్త రాహుల్ రెడ్డి, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ-హాస్పిటల్ అమలు మెరుగుపడాలి



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఈ-హాస్పిటల్ అమలు మరింత మెరుగుపడాలని సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి సూచించారు. మంగళవారం ఆయన ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో హెచ్‌ఓడీలతో సమావేశమై ఈ-హాస్పిటల్ అమలు తీరుపై ఆరా తీశారు. జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, పల్మనరి మెడిసిన్ విభాగాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ అనుమతి లేకుండా పీజీలకు సెలవులు ఇవ్వకూడదని హెచ్చరించారు. ప్రభుత్వం నుంచి స్టైపెండ్ తీసుకుంటూ నెలల తరబడి ఎగ్జామ్స్ కోసం సెలవు తీసుకుంటామంటే కుదరదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బర్త్, డెత్ సర్టిఫికెట్లలో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మెడికల్ రికార్డు సెక్షన్ ఆఫీసర్‌ను ఆదేశించారు. జనన, మరణ ధ్రువీకరణ సమయాల్లో తప్పులు లేకుండా నమోదు చేయాలని వైద్యులకు సూచించారు. రోగులకు ముందుగానే ఆధార్‌కార్డులో ఉన్న పేరు, అడ్రస్ ఆధారంగా ఓపీ, కేస్‌షీట్‌లలో వివరాలు నమోదు చేయాలన్నారు. సమావేశంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఫీజు వెనక్కి ఇవ్వాలి



విద్యార్థుల నుంచి సంతకాలు సేకరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ అనుబంధ కాలేజీల్లో డిగ్రీ ఫస్ట్ ఇయర్ ప్రవేశాల సందర్భంగా విద్యార్థుల నుంచి అక్రమంగా వసూలు చేసిన ఫీజు వెనక్కి ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన క్లస్టర్ యూనివర్సిటీ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ వద్ద విద్యార్థుల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, షాబీర్ బాషాలు మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెనకు అర్హత పొందిన విద్యార్థుల నుంచి ఎలాంటి ఫీజు కట్టించుకోకూడదన్నారు. అయినా ఒక్కో విద్యార్థి నుంచి రూ.6 వేల నుంచి రూ.9 వేల వరకు ఫీజు వసూలు చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా వర్సిటీ అధికారులు మేల్కొని ఫీజు వెనక్కి ఇచ్చి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మునిస్వామి, అశోక్, రాజశేఖర్, శివరాజు, రవి, విష్ణు, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

● జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్



ఈసీజీ చేస్తున్న డాక్టర్లు

కల్లూరు: పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తుందని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలతపేర్కొన్నారు. మండల పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని సందర్శించిన వారు ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌లో అన్నిరకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతోపాటు మందులు అందజేస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వారు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మన్న, ఎంపీటీసీ సామన్న, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఈశ్వరయ్య, నాయకులు నారాయణ, ఎంపీడీఓ జీవి రమణమూర్తి, ఈఓఆర్డీ రవికిషోర్, పీహెచ్‌సీ వైద్యులు మోతిలాల్ నాయక్, ఆనంద్‌రావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో ఇంటి వద్దకే పథకాలు

• ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన సచివాలయ వ్యవస్థతో పేదల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం 47వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ధర్మపేట, గిప్సన్ కాలనీలోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల మంజూరు, చేకూరిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు తెలుసుకొని, వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పథకాల కోసం ప్రజలు పనులు మానుకుని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేవారని, నేడు ఆ రోజులు పోయాయన్నారు. ప్రతి 50 ఇళ్లకు ఒకరిని వలంటీరుగా నియమించి, ప్రభుత్వ సేవలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అరుణ, నాయకులు ప్రసాద్, భారతి, సుధాకర్, సందీప్, లక్ష్మన్, లాజర్, బాషా, నాగరాజు, నజీర్, అబ్దుల్లా పాల్గొన్నారు.

21న ముస్లింల ఆధ్యాత్మిక సమావేశం



వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ఈ నెల 21న స్థానిక ఇస్లామియా అరబిక్ కళాశాల ఆవరణంలో మస్లిస్ సౌతుల్ హఖ్ ఆధ్వర్యంలో ముస్లింల ఆధ్యాత్మిక సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తెలిపారు. మంగళవారం రాజ్‌విహార్ సమీపంలోని రిసాల్‌దార్ మజీదులో కార్యక్రమం వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే విడుదల చేశారు. హజరత్ మౌలానా జమాల్ రహమాన్ సాహెబ్ హాజరుకానున్న కార్యక్రమంలో ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో సభ్యులు షావలి, జాకీర్, గౌస్, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రజక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని చెప్పిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. బీసీ జనాభాలో రజకులు ఉన్నా ఒక్క నామినేటెడ్ పోస్టు ఇవ్వలేదన్నారు. జగనన్న చేదోడు కింద అర్హులందరికీ ఆర్థిక సాయం అందజేయాలన్నారు. సమావేశంలో కర్నూలు న్యూసిటీ అధ్యక్షుడు సి.రాముడు, నాయకులు శ్రీనివాసులు, జయమ్మ, శేషాద్రి, ఎల్లయ్య, మద్దిలేటి, వీరేష్, రమణ, లక్ష్మన్న, చందు, కిషోర్, పుష్ప, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో జార్ఖండ్ వాసి మృతి

కర్నూలు: నగర శివారులోని సంతోష్‌నగర్ సర్కిల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సునిల్ పరాహియా (26) తీవ్ర గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. జార్ఖండ్ రాష్ట్రం పలాయి జిల్లా తానాపనాహి మండలం పోచంపి గ్రామానికి చెందిన సునిల్ పరాహియా ఉపాధి నిమిత్తం మరికొంతమందితో కలిసి కర్నూలుకు వలస వచ్చి వెంకటరమణ కాలనీలో ఉంటున్నాడు. సోమవారం రాత్రి సంతోష్‌నగర్ సర్కిల్ వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఆసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

'కౌశల్' పోస్టర్ ఆవిష్కరణ

కర్నూలు సిటీ: విజ్ఞాన భారతి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కౌశల్-2023 కార్యక్రమం పోస్టర్‌ను మంగళవారం డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వదేశీ సైన్స్ ఆవిష్కరణలు దేశ ప్రగతిని ప్రతిబింబిస్తాయన్నారు. కౌశల్ క్విజ్ పోటీల్లో పాల్గొనేందుకు 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు అర్హులన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను క్విజ్ పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కర్నూలు రూరల్ ఎంఈఓ-2 వినోద్‌కుమార్, జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ రంగమ్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ బాధ్యత అందరిదీ



పోస్టర్ విడుదల చేస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం, ఆసుపత్రి వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): రోడ్డు ప్రమాదాల నివారణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం తెలిపారు. ప్రపంచ ట్రామా దినోత్సవాన్ని పురస్కరించుకుని జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం రాజవిహార్ సెంటర్‌లో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఏపీ ట్రాఫిక్ పోలీసులు అందిస్తున్న సేవలు, ట్రామా మేనేజ్‌మెంట్‌లో వారు చేస్తున్న కృషిని వైద్యులు వివరించారు. అనంతరం ట్రామా డే విశిష్టతను డీఎస్పీ వివరించారు. కార్యక్రమంలో హాస్పిటల్ ఎమర్జెన్సీ హెచ్‌ఓడీ డాక్టర్ రామమోహన్‌రెడ్డి, డాక్టర్లు రవిబాబు, చంద్రశేఖర్, బాలమురళీకృష్ణ, గణేష్, రమణబాబు తదితరులు పాల్గొన్నారు.